క్లుప్తంగా

బండపల్లె ఘనంగా గంగ జాతర



బండపల్లెలో కొలువుదీరిన గంగమ్మ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం బండపల్లె ప్రాంతంలో మంగళవారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి శిరస్సును కొలువు దీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారి మండపం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నైవేద్యంగా అంబలి సమర్పించి మొక్కులు చెల్లించారు. రాత్రి పిండివంటల సమర్పణ, విశేష పూజలు వైభవంగా జరిగాయి. తదనంతరం వీధి నాటకం ప్రదర్శించారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



బ్యాగులను పరిశీలిస్తున్న ఎంఈఓ రుక్మిణి

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలానికి సంబంధించిన 3,499 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి స్కూల్ బ్యాగులు అందినట్లు ఎంఈఓ రుక్మిణి తెలిపారు. మంగళవారం అందిన బ్యాగులను ఆమె పరిశీలించిన అనంతరం వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా విలువలు ఉద్దీపనం చేయాలి



కార్యక్రమం నిర్వహిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : బాల్యంలోనే చిన్నారులకు మానవతా విలువలు ఉద్దీపనం చేయాలని శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు మధుసూదనం అన్నారు. మంగళవారం స్థానిక సంతపేటలోని దేవీ బాలమందిర్ పాఠశాలలో బాల వికాస్ కార్యక్రమాన్ని ఆ సంస్థ నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ, తమ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు బాలవికాస్ కోర్సును నిర్వహిస్తుంటామని చెప్పారు. చిన్నతనం నుంచే మానవతా విలువల గురించి, సమాజసేవ, తల్లిదండ్రులు, గురువుల పట్ల ప్రేమానురాగాల గురించి విద్యార్థులకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు భజనలు, నీతికథలు, చిత్రలేఖనం, ఓంకారం, శ్లోకాలు నేర్పించారు. కార్య క్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, హెడ్ మాస్టర్ సుజాత, ఆర్గనైజేషన్ సభ్యులు శేషనారాయణ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన



రాహుల్‌గాంధీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న జాగరణ సమితి సభ్యులు

పుంగనూరు: కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు రాహుల్‌గాంధీ హిందువులపై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హిందూ జాగరణ సమితి వినూత్న నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం రాహుల్‌కు శ్రద్ధాంజలి ఘటించింది. సంఘ నాయకులు పరమేష్, వెంకటేష్, రాజేష్, మహేష్ ఆధ్వర్యంలో రాహుల్ చిత్రపటానికి చెప్పుల హారం వేసి నివాళులర్పించారు. రాహుల్‌గాంధీ ఫొటోలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేకపోతే హిందువుల సత్తా చూపుతామని, కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు.

డిపాజిట్ మేళా సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరులో రెప్కో బ్యాంకు నిర్వహిస్తున్న డిపాజిట్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు చీఫ్ మేనేజర్ యంజీ రుషి కోరారు. మంగళవారం స్థానిక బజారు వీధిలో బ్యాంకు ఆధ్వర్యంలో డిపాజిట్ మేళాను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భారత ప్రభుత్వ సంస్థ అయిన రెప్కో బ్యాంకు ఖాతాదారులకు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తోందని తెలిపారు. సీనియర్ సిటిజన్లు, పిల్లలు, మహిళలు, సాధారణ ప్రజల కోసం ప్రత్యేక డిపాజిట్ పథకాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ 3 నుంచి 5 ఏళ్ల కాలపరిమితి డిపాజిట్లు కూడా ఉన్నాయని తెలియజేశారు.

టీచ్ టు టూల్ శిక్షణ

పలమనేరు: స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరు మండలాలకు చెందిన టీచర్లకు టీచ్ టు టూల్ శిక్షణలో మంగళవారం ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. పలు ముఖ్య విషయాలను వివరించారు. శిక్షణలోని అంశాలను ఉపాధ్యాయులు బాగా అవగతం చేసుకుని విద్యార్థులకు సులువైన పద్ధతిలో చెప్పాలన్నారు. స్థానిక ఎంఈఓలు లీలా రాణి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

- నిబంధనల అమలుకు అధికారుల సన్నాహం
- వాహనదారులకు అవగాహన సదస్సులు



హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు (ఫైల్)

కాణిపాకం: వాహనదారుల భద్రతకు, రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం 1988లో మోటారు వాహన చట్టం కింద హెల్మెట్ ధారణ తప్పనిసరి చేసింది. 2010లో ఐక్యరాజ్య సమితి ఆదేశాల మేరకు వాహనదారుడి వెనుక కూర్చున్న ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాలనే నిబంధనలను అమలులోకి తెచ్చింది. దేశంలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వేలసంఖ్యలో ప్రజలు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ఈ చట్టం తీసుకు వచ్చింది. అయినా కేంద్ర, రాష్ట్రాల నిర్లక్ష్యం వల్ల మోటారు వాహన చట్టం సక్రమంగా అమలు కాక, ఏటా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోందని గతంలో ఓ న్యాయవాది ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం ఇటీవల హైకోర్టు వెలువరించిన తీర్పులో కేంద్ర మోటారు వాహన చట్టా న్ని సమర్థంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి నిబంధనల మేరకు ట్రాఫిక్ జరిమానాలు భారీగా విధించాలని ఆదేశించింది. అలాగే తీవ్రత, పరిస్థితులను బట్టి డ్రైవింగ్ లైసెన్సులు మూడు నెలల వరకు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తీర్పులో సూచించింది.

అమలు చేసేలా..చర్యలు

మోటారు వాహన చట్ట ఉల్లంఘనలపై రవాణాశాఖ తీసుకుంటున్న చర్యలేమిటని హైకోర్టు ప్రశ్నించడంతో ఆ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. రాష్ట్రంలో మోటారు వాహన చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏపీ లీగల్ సర్వీసెస్ ఆథారిటీకి బాధ్యతను అప్పగించింది. జిల్లాలో సుమారు 3.56 లక్షల ద్విచక్ర వాహనాలు, సుమారు 15 లక్షల లైసెన్సు జారీ అయ్యాయి. జిల్లాలోని వివిధ రహదారుల్లో ఏటా దాదాపు నాలుగు వేల వరకూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోజూ ప్రమాదాల్లో సగటున ముగ్గురు మరణిస్తున్నారని కొంతకాలం క్రితం ఒక అధ్యయనంలో తేలింది. మృతుల్లో ఎక్కువగా మోటార్ సైక్లిస్టులే ఉండటం, అందులోనే హెల్మెట్ ధరించని యువకులే ఉండటంతో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సంకల్పించారు. దీంతో కొత్త ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసిన రోజునే హెల్మెట్ తీసుకోవలసిన నిబంధనను రవాణాశాఖ విధించింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సర్టిఫైడ్ హెల్మెట్లను ధరించాలని, తలకు సరిపోయే విధంగా సౌకర్యవంతమైన హెల్మెట్‌ను ఎంచుకోవాలని రవాణాశాఖ చెబుతోంది.

ప్రాణం విలువ గ్రహించండి



అధికారుల బలంవతంతోనే, జరిమానాలు వేస్తారనే భయంతో హెల్మెట్ ధరించడం కంటే..ప్రమాదవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాలు గుర్తించాలి. ప్రాణం విలువను తెలుసుకోవాలి. బైక్ నడిపేటప్పుడు తమకో కుటుంబం ఉందనే విషయాన్ని గుర్తించాలి. ఫ్యాషన్ పేరుతో హెల్మెట్‌కు దూరం కావద్దు. దీనిపై తరచూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని హెల్మెట్ ధరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

-నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

ఇలా చేస్తే రక్ష

- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చుననే అవగాహన పెంచాలి.
- వాహన చట్ట నిబంధనల గురించి, హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకుంటే కలిగే ప్రాణ నష్టాన్ని తెలియజేసేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండే తేలికపాటి హెల్మెట్‌లను ఎంపిక చేసుకోవాలి.
- రోడ్లపై విధులు, వాహన తనిఖీలు నిర్వహించే పోలీసు అధికారులు తప్పనిసరిగా బాడీ కెమెరాలు ధరించేలా చర్యలు తీసుకోవాలి.
- మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించే ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానా వారిపై కఠినంగా వ్యవహరించాలి.

హెల్మెట్..కవచం

- రోడ్డు ప్రమాదాల బారిన పడితే హెల్మెట్లు తల లేదా మెదడుకు తీవ్రమైన గాయం కాకుండా రక్షణ కల్పిస్తాయి.
- ముఖ కవచంతో కూడిన హెల్మెట్లు గాలి, దుమ్ము ప్రభావాన్ని తగ్గించడం ద్వారా దృశ్య మానతను మెరుగుపరచడంలో సహాయపడతాయి.
- బైకు నడుపుతున్న వాతావరణ పరిస్థితుల్లో వాంఛనీయమైన వెంటిలేషన్‌ను అందించే హెల్మెట్ సౌకర్యంగా ఉంటుంది.

హైస్కూలు భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని వరదప్పనాయుడు ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు చిట్టిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దాదాపు అర్ధ శతాబ్దం ఘన చరిత్ర కలిగిన వరదప్పనాయుడు ఉన్నత పాఠశాలకు 2022లో నాడు-నేడు రెండవ దశలో అప్పటి వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ పర్యవేక్షణలో పాఠశాల యాజమాన్య కమిటీ భవనం నిర్మాణం చేపట్టిందన్నారు. ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, ఎలక్ట్రీషియన్ పనులు పెండింగ్‌లో పెట్టేశారన్నారు. ఏడాదిగా పనులు జరగకపోవడంతో భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఆక్రమించుకునేందుకు వీధి వ్యాపారులు యత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జి రామభద్ర, సెంట్రల్ మండల అధ్యక్షులు షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రూరల్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి తెలిపారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు-1, సహాయకుల పోస్టులు 5 ఖాళీలున్నాయన్నారు. ఇందుకు పదవతరగతి పాసై ఉండాలన్నారు. వయస్సు 21-35ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గానికి సంబంధించిన వారు 18 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 19వ తేదిలోపు దరఖాస్తులను చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లె ప్రభుత్వ ఐటీఐ సమీపంలోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు...

తవణంపల్లె: మండలంలోని నారసింహనపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. ఈ పోస్టును బీసీ-ఏకు రిజర్వు చేసినట్టు చెప్పారు. స్థానికులుగా ఉండి, అర్హులైన వివాహిత మహిళలు ఈ నెల 19వ తేదీ లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మండలం	ప్రాంతం	పోస్టు	కేటగిరి
చిత్తూరు	కుర్రపల్లె	మినీ అంగన్‌వాడీ కార్యకర్త	ఓసీ
చిత్తూరు	తిమ్మసానిపల్లె	సహాయకులు	ఓసీ
చిత్తూరు	శరవణపురం-2	సహాయకులు	ఓసీ
చిత్తూరు	గంగసాగరం	సహాయకులు	ఓసీ
గుడిపాల	13-గొల్లపల్లె	సహాయకులు	ఓసీ
గుడిపాల	శ్రీరంగపల్లె	సహాయకులు	ఎస్సీ

నేడు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. డివిజన్ పరిధిలో సమస్యలను వినియోగదారులు తెలియజేయాలని కోరారు.

రేపు విద్యుత్ అదాలత్

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. పైపల్లె, చిత్తూరు రూరల్స్-1 సబ్ డివిజన్ల పరిధిలోని బంగారుపాళ్యం, యాదమరి, ఐరాల, తవణంపల్లె మండలాల్లోని వినియోగదారులు దీనిని వినియోగించుకోవాలన్నారు. పైపల్లె క్రాస్‌లోని సబ్‌స్టేషన్‌లో ఉదయం 11.30 కార్యక్రమం ప్రారంభమవుతుందని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

ఐటీఐ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం బీఎస్‌ఆర్ పేటలోని ఐటీఐలో వివిధ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబమూర్తి తెలిపారు. కొఫా, మెకానికల్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ మోటార్ వెహికల్, డి- మెన్ సివిల్ కోర్సులు ఉన్నాయన్నారు. 10 తరగతి పాసై..ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసు కోవచ్చునన్నారు. 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

గుండ్లపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



పట్నంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్ కుమార్

ఐరాల: మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆ తర్వాత ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లారు. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అలాగే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో..

తవణంపల్లె: గర్భవతులు 104, 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర మోహన్‌వేలు కోరారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు ఆసుపత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పట్నంలో..

అలాగే మండలంలోని పట్నంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు, గర్భవతులకు 104 మొబైల్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేయించారు. మందుల అందజేశారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపాలలో...

గుడిపాల: మండల కేంద్రంలో మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమహేష్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బీపీ, షుగర్, గర్భవతులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం మంచాన పడ్డ రోగులకు ఇళ్లవద్దకే వెళ్లి పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సోనియా, చంద్ర, సింధు పాల్గొన్నారు.



తవణంపల్లె: గర్భవతులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



గుడిపాల: రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించరూ!



కలెక్టర్‌తో పలు సమస్యలపై చర్చిస్తున్న ఐక్యవేదిక నాయకులు

– కలెక్టర్‌కు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక వినతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి కోరారు. మంగళవారం అసోసియేషన్ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని కలిసి పలు సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దీర్ఘకాల భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అట్రాసిటీ కేసులు పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ధనంజయరావు, గోవిందస్, రవి, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావును చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్ కుమార్ బాధ్యతలు స్వీకరించడం విదితమే. మంగళవారం చిత్తూరులోని న్యాయస్థానాల సముదాయంలో జిల్లా జడ్జిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందచేశారు.

ప్రమాణాలతో విద్యాబోధన : డీఈఓ



నరహరిపేట పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజులు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

గుడిపాల: విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రమాణాలతో విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని బొమ్మసముద్రం, నరహరిపేట ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల స్టాక్ పాయింట్‌లోని స్కూల్ బ్యాగులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే వస్తున్న స్టాక్‌పై ఆరా తీశారు. కోడిగుడ్లు సైజు ఎంత పరిమాణంలో ఉన్నాయో చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో మధ్యాహ్న భోజనం పెట్టాలని, టీచర్లు భోజనం తయారీని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లో గత విద్యాసంవత్సరంలో సాధించిన ఫలితాలను తెలుసుకున్నారు. మొదటి సంవత్సరం 94శాతం, రెండవ సంవత్సరం 93 శాతం సాధించినట్లు తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామ్‌నాయక్, గణపతి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



తుంబకుప్పంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

బంగారుపాళెం: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ అన్నారు. మండలంలోని తుంబకుప్పం పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓ, ఎంఎల్‌హెచ్‌పిలతో సీజనల్ వ్యాధులపై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ , ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే డెంగీ, మలేరియా, టీబీ వంటి వ్యాధుల గురించి వివరించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. విధుల నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించరాదన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి ట్యాంకర్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు లోకేష్, సెల్వరాజ్, సూపర్‌వైజర్లు హరికృష్ణ, అముద తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల జీతాలు మంజూరు చేయరూ!

-డీఈఓకు సీఆర్‌పీ అసోసియేషన్ వినతి

చిత్తూరు కలెక్టరేట్ : సమగ్రశిక్ష శాఖ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు రెండు నెలల జీతాలు మంజూరు చేయాలని సీఆర్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి కోరారు. మంగళవారం ఆయన అసోసియేషన్ నాయకులతో కలిసి డీఈఓ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా సీఆర్‌పీలకు జీతాలు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నట్టు నివేదించారు.

గ్రామస్తులకు అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి ప్రియాంక

పూతలపట్టు: డయేరియాపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి ప్రియాంక ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. గ్రామాల్లో జ్వరం, విరేచనాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందేలా ఆశా వర్కర్లు బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో మురుగు నీరు, నిల్వ ఉన్న నీటిని తొలగించి, గ్రామ కార్యదర్శులు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ, సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి, సూపర్‌వైజర్‌నూర్జహాన్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డయేరియా మాసోత్సవ ర్యాలీ



ర్యాలీలో అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం చవటపల్లె అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో మంగళవారం డయేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. డయేరియా వ్యాప్తి, దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి దిలీప్ కుమార్, సీఓ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.